క్లుప్తంగా

ఐరన్ పోలిక్‌తో రక్తహీనత దూరం

ఫిరంగిపురం: ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను దూరం చేసుకోవచ్చని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండంలోని సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాలతో పాటు అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్‌లు ఆరోగ్య సిబ్బంది వేసినట్లు ఆమె తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతిలోపు పిల్లలకు పింక్ రంగు మాత్రలు, ఆరు నుంచి పదో తరగతి వరకు పిల్లలకు బ్లూరంగు బిల్లలు అందజేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఒక ఎంఎల్ మందు అందిస్తున్నట్లు చెప్పారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఫిరంగిపురం: మండలంలోని మూడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.అనూరాధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొనుగుపాడు -1, నుదురుపాడు-1, అమీనాబాద్-2 పోస్టులకు ఈనెల 22వ తేదీనాటికి 18ఏళ్లు నిండిన వారు అర్హులని చెప్పారు. ఆధార్, విద్యార్హత, కుల, నివాసధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన లైన్ల ఏర్పాటు, మరమ్మతుల నిమిత్తం తాడేపల్లి రూరల్ పరిధిలోని నూతక్కి, రామచంద్రాపురం, చిర్రావూరు ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

గాయపడిన ముఠా కార్మికుడికి ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో నివాసముండే ఓ ముఠా కార్మికుడు గాయపడడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే ఆర్కే అందించిన ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పటంలో ఉండే ముఠా కార్మికుడు నాంపల్లి నరసింహారావు ఇంటికి వెళ్లి అందజేశారు. నరసింహారావు ముఠా పనిచేస్తుండగా యూరియా బస్తా పడి కాలు విరిగింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకున్నా ఇల్లు గడవడం కష్టంగా ఉండడంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ యువజన కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో విద్యార్థులకు అవగాహన సదస్సు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీనిధి గ్రూపు ప్రతినిధి ఆశిష్ మిట్టల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వ్యక్తిత్వ వికాస నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. నూతన ఆవిష్కరణ విధానాలను విశ్లేషించారు. కార్యక్రమంలో ఆచార్య కె. రాఘవరావు, విశ్వవిద్యాలయ వైస్ చైర్మన్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రామకృష్ణ, విభాగ అధిపతులు డాక్టర్ పి.ఎస్.ఓ. అరుణశ్రీ, డాక్టర్ కె.అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరికీ తాగునీరు అందించేందుకు చర్యలు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో తాగునీటిని సమృద్ధిగా అందించేందుకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది గురువారం పనులు చేపట్టారు. కొలనుకొండలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి తాగునీరు వదిలే సమయంలో పైపులైన్ల ద్వారా అన్ని ప్రాంతాలకు సరఫరా చేయడం కష్టతరంగా మారింది. పలు ప్రాంతాలకు నీటిని మళ్లించేందుకు నాలుగు ప్రాంతాల్లో వాల్వ్ ఏర్పాటు చేసి అందరికి తాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకున్నట్లు కొలనుకొండ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు.

ఈనాడువి తప్పుడు రాతలని తేలింది

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- ఈనాడు దినపత్రిక ప్రతులు దహనం



ఈనాడు దినపత్రిక ప్రతులను తగలబెడుతున్న కత్తెర సురేష్ కుమార్, నాయకులు

తాడికొండ: ఈనాడులో రాస్తున్నవి తప్పుడు రాతలని అదే పత్రికలో సవరణ వార్త ప్రచురించడం ద్వారా రుజువైందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. పట్టాభి పాత ఫొటోలతో ఈనాడులో వండి వార్చిన తప్పుడు కథనంపై స్పందించిన ఆయన గుంటూరులోని భారత్‌పేట నియోజకవర్గ కార్యాలయం ఎదుట కార్యకర్తలు, నాయకులతో కలిసి ఈనాడు ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రామోజీకి కులపిచ్చి నెత్తికెక్కి బాబును గద్దెనెక్కించాలనే తపనతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విషపు రాతలు రాస్తున్నాడనేది బహిరంగంగా తేటతెల్లమైందన్నారు. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి అరెస్టు వ్యవహారంపై రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేందుకు ఆయన పాత ఫొటోలను పెట్టి తప్పుడు కథనాలు రాసిన ఈనాడు గుట్టు రట్టవడంతో, ఆ పత్రికలో ఎక్కడో మారుమూలన సవరణ వార్త రాసి తప్పించుకోవాలని చూడటంపై మండిపడ్డారు. నిత్యం విషపు రాతలతో ఎల్లో మీడియా ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని, అందులో భాగంగానే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 నాయుడు స్వార్థంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిస్తే ఎల్లో మీడియా బాబుతో కుమ్మక్కై విషపు రాతలకు దిగడంపై పలువురు మండిపడ్డారు. 4 శాతం ఓటు బ్యాంకు లేని ఓ సామాజిక వర్గం అధికారం కోసం రాష్ట్రంలో చేస్తున్న ఆగడాలు అంతా ఇంతా కాదని, తమ ఆధిపత్యం కోసం ఎందాకైనా దిగజారి వ్యవహరిస్తున్న వీరికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఇకనైనా రామోజీ విషపు రాతలు మానుకుంటే మంచిదని, సామాజిక, ఆర్థిక విప్లవం మొదలై ప్రజలు సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ మంచి చెడులను బేరీజు వేసుకుంటున్న ఈ రోజుల్లో కూడా ప్రజలను తప్పుదారి పట్టించాలని చూడటం రామోజీ అవివేకానికి నిదర్శనమన్నారు. ఎల్లో మీడియా బాబు కోసం ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోపోతే రాష్ట్రంలోని ప్రజలంతా ఏకమై తగిన బుద్ధి చెప్పి వెళ్లగొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో మాక్ ఫైర్ డ్రిల్



మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ వారు ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం మంగళగిరి ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో మాక్ ఫైర్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ నారాయణ, మంగళగిరి అగ్నిమాపక అధికారి వై.వెంకటేశ్వరరావులు విచ్చేశారు. వారు మాట్లాడుతూ పెద్ద పెద్ద కంపెనీలలో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించినపుడు పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మంటలు అదుపులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మంగళగిరి ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో మంటలు వ్యాపించిన సమయంలో వాటిని ఏ విధంగా అదుపు చేయాలని, ముందుగా మంటలు వ్యాపించినపుడు సమీపంలో మంటలను అదుపు చేసేందుకు ఉన్న వస్తువులను ఏవిధంగా ఉపయోగించాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్లాంట్ మేనేజర్ బి.కమలాకరావు, ఫైర్ సిబ్బంది, హెల్త్ అధికారి ఎ. శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీలో గురువారం ముందస్తు ప్రమాద నియంత్రణ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫ్యాక్టరీల్లో భద్రతా తనిఖీల్లో భాగంగా గుంటూరు జిల్లా డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి ఎం.వి.శివకుమార్‌రెడ్డి జోసిల్ కంపెనీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్మాగారంలో పలు విభాగాల్లో భద్రతా ప్రమాణాలపై కంపెనీలో పనిచేసే కార్మికులు, మాక్ డ్రిల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో మేడికొండూరు తహసీల్దారు కరుణకుమార్, పోలీసు శాఖ, వైద్య శాఖ, పలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ వారసుడు సీఎం

ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి కనకారావు

తాడేపల్లిరూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల వారసుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ మాదిగ వెల్ఫేర్ కార్పొరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. గురువారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలు నుంచి చట్టసభల వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మహిళలకు పెద్దపీట వేస్తూ అణగారిన వర్గాలకు ఆత్మీయుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని అన్నారు. గతంలో ఏ పార్టీ అయినా ఈ విధంగా అణగారిన వర్గాలకు ఉన్నత అవకాశాలు కల్పించలేదని అన్నారు. తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల్లో మొట్టమొదటి సారిగా మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీ ఇచ్చి పెద్దల సభకు పంపడం మాదిగలకు గర్వకారణమని అన్నారు. సామాజిక న్యాయం, సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని అన్నారు. ఈ సమావేశంలో తాడేపల్లి వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రత్నాల చెరువు ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే ఆర్కే చొరవతో 24 గంటల వ్యవధిలో గురువారం సాయంత్రానికి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం రత్నాల చెరువులోని ఎస్సీ కాలనీలో పైప్‌లైను నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లారు. ఆ సమయంలో స్థానిక మహిళలు తమ ఇంటి వద్ద గతంలో పబ్లిక్ ట్యాప్‌లు ఉండేవని, అవి పాడైపోవడంతో తొలగించి మళ్లీ నిర్మాణం చేపట్టలేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డికి ఎస్సీ కాలనీలో అవసరమైన చోట వెంటనే పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించడంతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది 4 పబ్లిక్ ట్యాప్‌లను ఏర్పాటు చేయడం పట్ల కాలనీ మహిళలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రోటరీ క్లబ్ వార్షికోత్సవం



తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్థాపించి 118 సంవత్సరాలు అయిన సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ విచ్చేశారు. రోటరీ జిల్లా 3150 పూర్వపు గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్‌తో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక సేవా సంస్థ 118 సంవత్సరాలపాటు ప్రపంచ వ్యాప్తంగా 235 దేశాలలో 14 లక్షల మంది సభ్యులతో 520 జిల్లాలు విభజించబడి అనేక కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. 1905 సంవత్సరంలో కేవలం ఒక నలుగురితో చికాగోలో ప్రారంభమై ఈ రోజు ప్రపంచ స్థాయిలో వ్యాప్తి చెందడం కేవలం రోటరీ సభ్యుల సమూహ శక్తి వల్లే సాధ్యపడిందని అన్నారు. రాబోయే కాలంలో రోటరీ సభ్యుల ఐకమత్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ తుల్లిమిల్లి రామకృష్ణ, జొన్నాదుల భిక్షారావు, వడ్లమూడి శ్రీనివాసరావు, జవ్వాజి సురేష్, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ వెలుగులు

పరిశీలించిన విద్యుత్ శాఖ అధికారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రసిద్ధి గాంచిన గండాలయ్య దేవస్థానానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కొండ పైభాగంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆర్కే విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. గురువారం విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొండపై ఉన్న గండాలయ్యస్వామి దేవస్థానానికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వరరావు కొండపైకి 11 కేవీ విద్యుత్ సరఫరా చేసేందుకు నాలుగు పెద్ద పోల్స్, మరో ఆరు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, దానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే టెండర్లు పిలిచి భక్తుల సౌకర్యార్థం విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

27 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో ఈ నెల 27వ తేదీ నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గురువారం గుంటూరులోని భారత్‌పేట నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అందరి సహకారంతోనే కార్యక్రమం విజయవంతం అవుతుంది కనుక గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి సత్వర పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమ నిర్వహణ ఉండేలా సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 175/175 సీట్లు గెలిచేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఎల్లో మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఇంటికీ చేసిన మేలును వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం ఆధునిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుటుంబ నియంత్రణ స్టేట్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ నిర్మల గ్లోరీ విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య రెండు నుంచి మూడు సంవత్సరాలు విరామం తీసుకోవడం వల్ల మాతృ మరణాలు తగ్గుతాయని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణకు సంబంధించి అన్ని పద్ధతులు ఉచితంగా అందజేయడం జరుగుతోందని అన్నారు. కాన్పు సమయంలో ఇబ్బందులు, ఫ్రీ డెలివరీ గురించి, కాన్పు తర్వాత ఎదురయ్యే సమస్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆధునిక కుటుంబ నియంత్రణపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష, సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా ఈకేవైసీ చేయించుకోవాలి

మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాసులు



రైతులకు ఈకేవైసీపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి ఎ. శ్రీనివాసులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన రైతులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రబీ సీజన్ కాలానికి సంబంధించి పంట నమోదు చేయడం ప్రారంభించామని, పంట నమోదు తర్వాత రైతులందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే పంట నమోదు ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వేలిముద్ర వేయడం ద్వారా కానీ దూర ప్రాంతాల్లో ఉన్న వారు తమ ఫోన్ నెంబర్‌కి ఆధార్ లింక్ అయినట్లయితే ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పంట ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవడానికి అనర్హులౌతారని తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు వివరించారు.

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు తక్షణ పరిష్కారం

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై దృష్టి సారించి తక్షణ పరిష్కారం చేస్తానని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గురువారం గుంటూరులోని కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు వార్డెన్లు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఆమెను కలిసి సమస్యలు వివరించారు. ఫిరంగిపురం, తుళ్లూరులోని బీసీ వసతి గృహాలలో నాడు- నేడు కింద మరమ్మతులు చేయించేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. తాడికొండలో బీసీ బాలికల వసతి గృహం డ్రైనేజీ సదుపాయం సక్రమంగా లేనందున తక్షణం మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ భవానీ, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా, ఉపాధ్యక్షులు మురళీ, మహబూబ్ బాషా, నాగ భూషణం, సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. గురువారం తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమైన ఆమె గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఆరా తీసి పలు సమస్యలపై చర్చించారు. వేసవికి ముందే బోర్లు మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీ ర్యాలీని జయప్రదం చేయండి

సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్ : ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం, సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పజెప్పేందుకు మూడు నల్ల చట్టాలను తెచ్చిందని ఈ చట్టాల రద్దుకై సంవత్సరంపైగా ఢిల్లీ సరిహద్దుల వద్ద పెద్దఎత్తున ఆందోళన చేసిన చారిత్రాత్మక రైతు ఉద్యమానికి కేంద్రం తలొగ్గి నల్ల చట్టాలను రద్దు చేసిందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే ప్రకియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వేసిన అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ నిధులు పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్‌కె ఎర్ర, బి.శివారెడ్డి, బి.గోపాల్‌రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు గుడిసె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.